
# ఆడదాని కథ



అనూరాధకి తను అందగత్తెనని తెలుసు. తనకి పద్దెనిమిదేళ్ళు సంక్రాంతికి వెళ్ళాయని తెలుసు. తను లేడీస్ హాస్టల్లో వుండి బి. ఏ. ఫైనలియర్ చదువుతోందనీ- మరో ఆర్నెల్లల్లో తన చదువు పూర్తి అవుతుందనీ తెలుసు.

కానీ అనూరాధకి తను ఇంటికి పెద్ద అయిన మూలంగా గంపెడంత సంసారాన్ని చాకచక్యంగా ఎలా నెట్టుకురావాలో తెలియదు. చదువు అయిన తర్వాత ఉద్యోగం దొరుకుతుందో లేదో తెలియదు ఇంకా; ఉద్యోగం దొరికిన తర్వాత అందరి స్నేహితురాళ్ళలాగా తనకి సజావుగా పెళ్ళి అవుతుందో కాదో తెలియదు.

అయినా అనూరాధ చాలామంది చదువుకునే అమ్మాయిల్లా గతం గురించీ, భవిష్యత్తు గురించీ మధన పడ్డంలేదు. ప్రయత్నంమీద నమ్మకం ఉన్న మనిషి అనూరాధ. చదివిన చదువు, పెరిగిన వాతావరణం, చుట్టూ కలుషితం అయిన సంఘాన్నీ చూసిన తర్వాత అనురాధకి ఒకటే అన్పించింది—'జీవితం గురించి ఏది ఏమైనా భయపడకూడ'దని.

అలా అన్పించినప్పుడల్లా, పదహారేళ్ళకే అమ్మమ్మల్లా, కాకపోతే చిన్న పిల్లల్లా గిలగిల లాడే స్నేహితురాళ్ళని చూస్తే నవ్వొచ్చేది జీవితంలో తగిలిన చిన్న దెబ్బలకు- పెద్దగా డీలా పడిపోయే చదువుకున్న వాళ్ళని చూస్తే

నిగ్గేసేది.

* * *

అనూరాధకి ఇరవై ఏళ్ళు వచ్చాయి. చదువు పూర్తి అయ్యింది. నిలకడ అయిన ఉద్యోగం మాత్రం దొరకలేదు. నాల్గేసి నెలలు ఒక్కొక్క ఆఫీసులో ఉద్యోగం చేసేది. ఆమె అందాన్ని ఆశించో, ఆమెని డబ్బుతో కొనుక్కోవా అనుకునే వాళ్ళతో విసిగో అనూరాధ ఉద్యోగంలోంచి బయటకు వచ్చేసేది.

తనకి పెళ్ళి కాకపోవడం తన దురదృష్టం అని తను అనుకోకపోయినా, పెదాలు చప్పరించే వాళ్ళని చూస్తేనూ తన అందాన్ని, ఆకర్షణీయమైన అవయవాల్ని చూసి తన కన్నా ఎక్కువగా క్రిందా మీదా పడేవాళ్ళని చూస్తే అనూరాధకి కోపం, ఆ పైన చిరాకూ. ఇంకా ఇంకా ద్వేషం కలగసాగాయి. అందుకే ముందూ, వెనకా వెర్రివేషాలు వేసే వాళ్ళని లెఖ్ఖ చేసేదికాదు మొహంమీదే చెప్పుతీసుకుని కొట్టినంతపని చేసేది.

దాని మూలంగానే ఇరవై ఏళ్ళ అందగత్తె అనూరాధ అంటే, ఆకలితో చూసే వాళ్ళూ, సమయంకోసం కాచుకునే వాళ్ళూ ఎక్కువయ్యారు.

* * *

'ఎంటర్ ది డ్రాగన్' సినిమా చూసి టాంక్‌బండ్ మీద ఆటోలో వస్తోన్న అనూరాధ ముందుగా టాక్సీవచ్చి ఆగింది. అనుకోకుండా టాక్సీ వచ్చి ఆగడం, అందులోంచి నలుగురు అగంతకులు దిగడం, వాళ్ళు పైగా పోలీసులూ అధికారులూ అవడం అనూరాధకి ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి?" అంది.

ఇన్‌స్పెక్టర్ అన్నాడు, చూడమ్మాయి!" మధ్యాహ్నం నుంచీ చూస్తున్నాం. నీ ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది, నువ్వో ఏన్‌టీనేషనల్ ఎలిమెంట్‌లా, లేడీ స్మగులర్‌లా కన్పిస్తున్నావు..." అన్నాడు.

"నేనా..." అంది.

"అవును. అందుకే నువ్వు మాతో స్టేషన్‌కి రావాలి అక్కడే నీ సంజాయిషీ ఇచ్చుకో..."

ఆటోవాడు విసిగి అనూరాధని డబ్బులైనా అడక్కుండా వెళ్ళిపోయాడు

అనూరాధ తన వాచీ చూసుకుంది సరిగ్గా సాయంకాలం ఏడు గంటలవుతోంది. చుట్టూ వచ్చేపోయేజనంతో రోడ్డంతా రద్దీగా ఉంది.

"ఎక్కడ స్టేషన్‌కి?" అడిగింది.

"ఆబిడ్స్".

వెనకసీటు తలుపు తెరుచుకుని అనూరాధ టాక్సీలో కూర్చుంది

మహానగరంలో సాయంత్రం ఏడుగంటల ప్రాంతాల్లో పెళ్ళికాని ఆడపిల్లకి రోడ్డుమీద స్వేచ్ఛగా నడిచే, లేక టాక్సీ, ఆటోలో వెళ్ళే అదృష్టం లేదని తెలియని అనూరాధ; నగరాల్లో నీతిపాలు నీటిపాలు ఏనాడో అయిందంటే అంతగా నమ్మని అనూరాధ; చట్టాన్ని గౌరవించాలని టాక్సీ ఎక్కడంలో అవివేకం ఉందని తెలియని అనూరాధ ఎక్కడికి వెళ్ళింది?? అనూరాధని ఎక్కించుకున్న టాక్సీ ఏ స్టేషన్‌కి వెడుతోంది??

అనురాధ టాక్సీ ఎక్కగానే రెండు మూడు చేతులు ఆమె నోరు నొక్కాయి.

ఏదో సందులో ఆగిన టాక్సీలోంచి-జన సమ్మర్ధంలేని వీధిలోంచి అనూరాధని ఓ మేడమీద గదిలోకి జేరవేశారు.

అనూరాధ కట్లు విప్పారు...అప్పటికి అనూరాధకి తెలిసింది, తను వచ్చింది

ఎక్కడికో?? జరగబోయేది ఏమిటో???

"ఒక్క ఆడపిల్లకోసం ఇంత వేషాలు వేసుకోవాలా" అంది. అవును, వాళ్ళెవరూ ప్రభుత్వ అధికారులు కారు. ఇద్దరు తనతో కాలేజీలో చదివినవాళ్ళు. మరో ఇద్దరు తనతో ఉద్యోగాలు చేసినవాళ్ళు.

"నీ కోసం ఎంత పడిగాపులు పడ్డామని. మర్యాదగా అప్పుడే లొంగితే ఎంత బావుండేది" ఒకడు అన్నాడు.

"పోజు పెట్టేదరా......ఇప్పుడెక్కడికి పోతుంది. పువ్వుని నలిపినట్టు నలిపితేగాని వదలకూడదు"

అనూరాధకి తను అసహాయురాలనని - తప్పించుకునే దారిలేదనీ తెలిసి పోయింది ఎంతోమంది స్నేహితురాళ్ళు - చెప్పిన హృదయ విదారక గాథలు గుర్తుకొచ్చాయి.

అనురాధ చిన్నగా నవ్వింది...ఆపైన జుట్టు సరిజేసుకుంటూ అంది...

"మీ నలుగురికీ నేను కావాలి, అవునా."

"అవును..."

"ఒక్క ఆడదాన్ని నలుగురూ ఒకేసారి చెరచడం బావుండదు. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళయితే మంచిది. మిగిలిన ముగ్గురూ ఈ గదిలోనే వుంటారా?? మీకయితే ఏమో గాని-నాకు అదోలా వుంటుంది..."

నలుగురూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు

"ముందెవరో - వాళ్ళు ఈ గదిలో వుండండి. నేను ఎక్కడికి పారిపోలేను. ఆ విషయం మీకూ తెలుసుకదా?" అంది....?

"దీన్ని పాడుచేసి వదిలేస్తే ఎలారా? చూస్తే దీనికి భయంలేదులావుంది. ఆతర్వాత మన పేర్లన్నీ స్టేషన్‌లోచెపుతుందేమో..."

అనూరాధ నెమ్మదిగా అంది. "మిస్టర్ ఇది భారతదేశం. ఆడది పాడయిన తర్వాత తనంత తనే ఏ నూతిలోనో గోతిలోనో దూకడం అలవాటు అంతేగాని కేసులుపెట్టి కోర్టులచుట్టూ తిరిగి, అవమానానికి అద్దం పట్టుకుంటుందా?? పశువుల్లా ఒకేసారి మాత్రం నా మీద పడకండి..."

"నువ్వు చూస్తే తెగించిన దానిలా వున్నావ్..."

నేను డబ్బున్న దాన్నికాను. నాకు పలుకుబడీ లేదు. సాదా సంసార పక్షపు ఆడపిల్లని. మీరు చెరచిన తర్వాత - నాకు బ్రతకాలని వుంటే-లేక చావాలనిపిస్తే ఆ అవకాశం ఏదో నాకే ఇవ్వండి ... " ఆగి అంది... "నా యవ్వనాన్ని అందాన్ని మీకు ఇస్తున్నాను. ఈ చిన్న కోరిక నేను కోరడం తప్పా..."

వాళ్ళు చాలాసేపు ఆలోచించి "ముందే ఇవన్నీ ఎందుకు, తర్వాత ఆలోచిద్దాం..." అనుకున్నారు.

అలా సాయంకాలం ఏడు గంటలకు మొదలయిన ఓ అమాయక స్త్రీ మానభంగం కథ పదిగంటల వరకూ నడిచింది. ఓపిక లేక, తట్టుకోలేక శోషవచ్చి గుండె బండ రాళ్ళతో మోదుతున్నట్టవుతూంటే చావు కన్నా ఘోరమైన నికృష్టపు అనుభవాల్ని మూటగట్టుకున్న అనూరాధని నలిగిన మల్లె పువ్వులా రిక్షాలో పడేసారు-మానాన్ని అపహరించిన మగరాయుళ్ళు... రిక్షాచుట్టూ చేరి కేరింతలు కొట్టారు...అనురాధకి మాట్లాడాలని లేదో మాట్లాడలేకపోతోందో, ఊపిరి తీసుకుంటోందో, లేక అందుకు యాతన పడుతోందో వాళ్ళు పట్టించుకోలేదు....రిక్షా వెడుతోంది...రిక్షామీద కోటి దీపాల వెలుగులు: అంతలోనే చీకట్లు పడుతున్నాయి.

జరిగేదేమిటో తెల్సుకోవాలనిగానీ, జరిగిందేమిటో వినాలనిగానీ ఆ మహా జనానికి తోచకపోవడమే ... నేటి సభ్య ప్రపంచపు ఔన్నత్యం. అంతే!! అందుకే కథ-అనూరాధ జీవితంలా మధ్యలోనే ముగిసింది *

(హైదరాబాదు మహానగరంలో ఈమధ్య పెళ్ళి అయిన ఓ యువతిమీద జరిగిన అత్యాచారం గురించి పేపర్లో చదివినతర్వాత ఈ కథ వ్రాయాలనిపించింది. అంతర్జాతీయ మహిళా సంవత్సరపు గుర్తులు ఇంకా మాసిపోకుండానే ఆడవాళ్ళమీద అఘాయిత్యాలు జరగడం, వాటిని ఆపలేకపోవడం ఎవరి తప్పు అని ఆలోచిస్తే కన్పించే క్వొశ్చెన్ మార్కే ఈ కథకి ఊపిరి. అనూరాధ బ్రతకాలనీ, అంతకుమించి ఆమెకి ఆ గదిలో మరోరకంగా ప్రవర్తించే అవకాశంలేదనీ కథని ఆ విధంగా మలచవల్సి వచ్చింది...

స్త్రీ తన మీద జరిగే అత్యాచారాన్ని ఎదుర్కోలేదని అందరికీ తెలుసు, కానీ అదే అలుసుగా తీసుకుంటున్నారు - అందరూ...

మానం పోవడం అంటే ప్రాణం పోవడంకాదని ఆడది అనుకుంటే - అప్పుడే ఆడవాళ్ళ బ్రతుకులు కొత్తమలుపులు తిరగొచ్చు.

రచయిత)


## పుస్తక రూపంలో
## సమాజానందస్వామి

ప్రజాతంత్ర పాఠకుల ఆదరణను
విశేషంగా చూరగొన్న
సమాజానందస్వామి
కార్టూన్ కవితల, తొలి సంపుటి
చంద్ర బొమ్మలతో పుస్తక
రూపంలో వెలువడింది.

**ఖరీదు రెండు రూపాయలు**

ప్రతులకు: యురీపొయెట్రీ సర్కిల్
6-1-711, ఖైరతాబాదు,
హైదరాబాదు, 500004.

